

### తెల్లబంగారంవైపే రైతన్న..

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు తెల్ల బంగారం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. 8లో▸



### ఆర్టీసీ ప్రగతి బాట

విలేజ్ బస్ ఆఫీసర్ (వీబీఓ) వ్యవస్థతో ఆర్టీసీ ప్రగతి బాట పట్టనుందని డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. 8లో▸



### సంక్షేమంలో నంబర్ వన్

పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్సీ పట్నం, ఎమ్మెల్యే పైలెట్ అన్నారు. 9లో▸

## న్యూస్‌రీల్

### ఫారెస్ట్ భూముల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



ఇస్మాయిల్‌పూర్‌లో ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

**బషీరాబాద్:** ఫారెస్టు భూముల్లో రెండేళ్లుగా ప్రభుత్వం చేయించిన ఎనిమిది రకాల పనులపై ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. ఎఫ్ఎస్‌పీ బాసర సర్కిల్ ఎఫ్ఆర్ఓ రమేశ్‌రావు ఆధ్వర్యంలోని అధికారుల బృందం వికారాబాద్, ధారూరు, పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్, కొడంగల్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో పర్యటించింది. ఇందులో ఏఎస్ఆర్, ఎస్ఎంఎం కింద చేపట్టిన ప్లాంటేషన్, రాతి కట్టడాలు, కుంటగట్లు, గల్లికట్ట, నర్సరీలు తదితర పనులను సభ్యులు పరిశీలించారు. బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్ వద్ద చేపట్టిన ప్లాంటేషన్‌ను చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. అడవుల్లో చెట్ల నరికివేతను పూర్తిగా నివారించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరిగిన పనులపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు రేంజర్ శ్యాంసుందర్‌రావు, అధికారులు రషీద్, హర్షద్‌రాజ, కిరణ్, బషీరాబాద్ సెక్షన్ ఆఫీసర్ అన్వర్ తదితరులు ఉన్నారు.

### పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్

**వికారాబాద్ అర్బన్:** తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 12 నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రారంభమవుతాయని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, స్క్వాడ్ మెంబర్లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. నిత్యం రెండు సెషన్లలో ఎగ్జామ్స్ కొనసాగుతాయని తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రతీ కేంద్రంలో తాగునీటితో పాటు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వాహణ కమిటీ సభ్యులు రాజమోహన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ హయాంలోనే అందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

**పరిగి:** సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎస్‌గార్డెన్‌లో తెలంగాణ సంక్షేమ సంబరాలను ఘనంగా నిర్వహించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ ప్రొసిడింగ్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు సరైన మేలు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ అరుణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, మండలాల ఎంపీపీలు అరవింద్‌రావు, అనసూయ, సత్యహరిశ్చందర్, జెడ్పీటీసీలు హరిప్రియ, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాందాస్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పాలిక్వెస్ట్‌పై అవగాహన

**అనంతగిరి:** పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థుల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాలిక్వెస్ట్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిపై ఈనెల 14న విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ విద్య, కోర్సులు, కళాశాలల్లో వసతులు, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

## గాలివాన.. హైరానా



రాంపూర్‌తండా వద్ద వ్యవసాయ పొలంలో విరిగిపడ్డ ట్రాన్స్‌ఫార్మర్



ఆరంపూర్‌తండాలో రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



నవాబుపేట మండలం చిట్టిగిద్దలో పంట పొలంలో నిలిచిన వర్షం నీరు

ధారూరు, నవాబుపేట, మోమిన్‌పేట మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. చిటిగిద్ద, మొరంగపల్లిలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటల్లో వర్షం నీరు నిలిచింది. నేల కూలిన చెట్లు రోడ్లకు అడ్డంగా పడటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో జనం అవస్థలు పడ్డారు.

– ధారూరు

## రెచ్చిపోతున్న అక్రమార్కులు

**పాత తాండూరు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా**

- నిదానంగా వెళ్లాలని సూచించిన వీఆర్ఏపై ట్రాక్టర్ యజమాని దాడి
- తీవ్రంగా గాయపడిన బాధితుడు
- తహసీల్ కార్యాలయం ఎదుట స్థానికుల ఆందోళన





తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పాత తాండూరు వాసులు, (ఇన్‌సెట్‌లో) ఇసుక అక్రమార్కుల దాడిలో గాయపడి జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వీఆర్ఏ ఎల్లప్ప

**తాండూరు రూరల్:** తాండూరులో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నెమ్మదిగా వెళ్లాలని సూచించిన పాపానికి ట్రాక్టర్ ఆపి వీఆర్ఏను చితకబాదారు. ఈ సంఘటన తాండూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాత తాండూరుకు చెందిన గడుగు ఎల్లప్ప వీఆర్ఏగా పని చేస్తున్నారు. గురువారం రాత్రి పాత తాండూరులోని కాగ్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అతివేగంగా దూసుకెళ్లడాన్ని గమనించి.. నిదానంగా వెళ్లాలని సూచించాడు. దీంతో కోపోద్రిక్తుడైన ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని ఆపేశాడు. మరో వాహనంపై వెనకే ఉన్న ట్రాక్టర్ యజమాని అబ్రహర్ లాల వీఆర్ఏపై దాడి చేశాడు. ఇతనికి ట్రాక్టర్ డ్రైవర్ తోడయ్యాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే బాధితున్ని పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. అనంతరం కౌన్సిలర్ వసంతశ్రీధర్, అఫ్రీన్ జావేరియా, శోభారాణి తదితరులు వీఆర్ఏతో కలిసి వెళ్లి పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా**

పాత తాండూరు వీఆర్ఏ ఎల్లప్పపై దాడికి నిరసనగా స్థానికులు శుక్రవారం పెద్ద ఎత్తున తరలివెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పగలు, రాత్రి తేడాలేకుండా పాత తాండూరు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోందని మండిపడ్డారు. ట్రాక్టర్లు అతివేగంగా వెళ్లడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార పార్టీ నేతల అండదండలు చూసుకునే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే ఇసుక అక్రమార్కులకు కళ్లెం వేయాలని డిమాండ్ చేశారు.

**క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తాం**

ఈ విషయమై తహసీల్దార్ చిన్నప్పల నాయుడు మాట్లాడుతూ.. వీఆర్ఏపై దాడిచేసిన లాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశిస్తామని తెలిపారు. సిబ్బంది కొరతతో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం కొంత ఇబ్బందిగా మారిందన్నారు. ఉన్న కొద్ది పాటి సిబ్బంది రెవెన్యూ పనులు, దశాబ్ది ఉత్సవాల్లో బీజీగా ఉన్నారని తెలిపారు. పాత తాండూరులోని కాగ్నానది వద్ద ఉన్న ఇసుక రీచ్ పర్మిషన్ రద్దు చేయాలని కలెక్టర్‌కు లెటర్ రాసినట్లు వివరించారు.

**ఇరువురిపై కేసు నమోదు**

**తాండూరు టౌన్:** వీఆర్ఏ ఎల్లప్పపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి తాండూరు నుంచి చెన్‌గేష్‌పూర్ వెళ్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను వీఆర్ఏ ఎల్లప్ప నిలిపేశాడన్నారు. ఈ విషయమై ట్రాక్టర్ డ్రైవర్ ఫిరోజ్ యజమాని లాలకు ఫోన్ చేసి చెప్పాడన్నారు. ట్రాక్టర్ వద్దకు వచ్చిన లాల కోపోద్రిక్తుడై వీఆర్ఏపై దాడి చేశాడని తెలిపారు. దీంతో అతని ముఖంపై గాయాలయ్యాయని, బాధితుడి ఫిర్యాదు మేరకు లాల, ఫిరోజ్‌పై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

## అభివృద్ధి ఘనత సీఎందే

- కేసీఆర్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
- వికారాబాద్‌లో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**వికారాబాద్ అర్బన్:** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులదేనని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లోని గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంబరాలకు స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణలో పెద్ద మొత్తంలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజయం సాధించారన్నారు.అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి బతికేవారికి ఆర్థిక సాయం కింద రూ.లక్ష అందజేయనున్న పథకంపై హర్షం వ్యక్తంచేశారు. అంబేడ్కర్ కలలను నిజం చేయడానికి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు వేదికలు నిర్మించి, పంటల సాగుపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం చేస్తోందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**బాల్య వివాహాలు తగ్గాయి**

ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. అమ్మాయిలు దేనిలోనూ తక్కువ కాదన్నారు. వీరిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో అద్భుతాలు సాధిస్తారని స్పష్టంచేశారు. పేద యువతలు వివాహం కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. ఈ పథకాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయన్నారు.

**తెలంగాణలో అనేక పథకాలు**

కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు తెలిపారు.కేసీఆర్ కిట్‌తో పాటు, నగదు ప్రోత్సాహకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్, ఆర్డీఓ విజయకుమారి, వ్యవసాయ అధికారి గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

## ఆలయాలు అందరివి



గ్రామస్తులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

- కుల వివక్షకు తావు లేకుండా మెలగాలి
- ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి
- బ్రాహ్మణపల్లిలో గ్రామస్తులతో సమావేశం

**దోమ:** కుల వివక్షకు తావులేకుండా గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలిసి సోదర భావంతో ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో.. దళితుల ఆలయ ప్రవేశం విషయమై చోటు చేసుకున్న ఘర్షణపై శుక్రవారం ఎస్పీ కోటిరెడ్డితో కలిసి వెళ్లి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు. గ్రామాల్లోని ఆలయాలు అందరివని, కుల, మత భేదాలు లేకుండా అందరూ వీటిని సందర్శించుకోవచ్చని తెలిపారు. మనుషుల మధ్య భేదాభిప్రాయాలు తగవన్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఆలయాల్లో పూజలు చేసుకోవాలని తెలిపారు. ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్కోవాలని సూచించారు. గతంలో జరిగిన ఘటనలను మర్చిపోయి ప్రశాంత వాతావరణంలో పనులు చేసుకోవాలని తెలిపారు.

**అవగాహన కల్పిస్తాం..**

అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. బ్రాహ్మణపల్లిలోని దేవాలయంలో రఘురాం అనే దళిత వ్యక్తి పూజకు వెళ్లడంతో గొడవ తలెత్తిందని, దళితులకు ఆలయ ప్రవేశం లేదని చెప్పడం దురదృష్టకరమని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కుల వివక్ష కొనసాగుతోందని, సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా స్థానికులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. బాధ్యులైన 18 మందిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎవరైనా చట్టవ్యతిరేఖ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి మల్లేశం, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎస్ఐ విశ్వజాన్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం

- తొలిరోజు 80 వేల మందికి పైనే..
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన జనం
- కిటకిటలాడిన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్

**అబిడ్స్/గన్‌ఫౌండ్రీ:** ఆస్తమా రోగులు ఎంతగానో ఎదురుచూసే చేప ప్రసాదం పంపిణీ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. తొలిరోజు రాత్రి పొద్దుపోయే వరకు దాదాపు 80 వేల మందికి చేప ప్రసాదం ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకు పంపిణీ ఉంటుందన్నారు. కాగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మొదట బత్తిని కుటుంబ సభ్యుల చేపప్రసాదం పంపిణీని శుక్రవారం ఉదయం 8 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా చేప ప్రసాదం వేసి ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆస్తమా రోగులు, సామాన్య ప్రజలు కూడా వేలాదిమంది తరలివచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్, మత్స్యశాఖ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వాటర్ బోర్డు, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు పలు శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు పలు శాఖల ఉన్నతాధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఉండి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**మంత్రి స్వయం పర్యవేక్షణ**

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా శుక్రవారం రోజంతా పర్యవేక్షించారు. ఉదయం ప్రారంభించిన మంత్రి రాత్రి వరకు పలుమార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. వాటర్‌బోర్డు, బద్రి విశాల్ వంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచినీరు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ఇక నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, నగర కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సాగుకు సన్నద్ధం

- పొలాలను చదును చేసిన రైతులు
- ఎరువులు, విత్తనాల సేకరణలో బిజీ
- పెరిగిన ధరలతో ఆందోళన
- రైతుబంధు కోసం ఎదురు చూపు




**కొడంగల్:** ఏరువాక ముగిసింది.. మృగశిర కార్తె ప్రారంభమైంది.. వర్షాలు కురిస్తే విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారు. వీటి ధరల పెరుగుదలపై నియంత్రణ లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. వ్యవసాయం పండుగలా మారిన రాష్ట్రంలో రైతన్నలకు సాగు ఖర్చులు ఇబ్బందికరంగా మారాయి. పెట్టుబడి పెట్టలేక, ఎరువులు కొనలేక రైతులు సతమతమవుతున్నారు. విత్తనాలు వేసే సమయం కావడంతో రైతుబంధు కోసం ఎదురు చూస్తున్నారు.

**పెరిగిన ఖర్చులు**

సాగు పెట్టుబడి కోసం రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేలు అందజేస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న సాయాన్ని బ్యాంకర్లు పంట రుణాల కింద జమ చేసుకుంటున్నారు. దీంతో ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయం చేసేది సన్నచిన్నకారు రైతులే. కొడంగల్ నియోజకవర్గంలో ఎకరా, రెండెకరాలున్న రైతులే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వానాకాలం సీజన్‌లో సుమారు 40వేల హెక్టార్లలో రైతులు పలు రకాల పంటలను సాగు చేసే అవకాశం ఉంది.

| ఎరువు | ధరలు |
|---|---|
| డీఏపీ | రూ.1,350 |
| కాంప్లెక్స్ | రూ.1480 |
| గ్రోమోర్ | రూ.1,500 |
| 10.26.26 | రూ.1,470 |

**ఖర్చులు పెరిగాయి**



గతేడాది కన్నా ఈసారి సాగు ఖర్చులు పెరిగాయి. కూలీల ధరలతో పాటు ఎరువులు, విత్తనాల ధరలు అధికంగా ఉన్నాయి. ఎరువులు కొనడానికి ఇబ్బందిగా ఉంది. రైతుబంధు డబ్బులు త్వరగా ఇస్తే సాగుకు చేయూత అందుతుంది.

– సత్యమ్మ, మహిళారైతు, పర్సాపూర్

డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు వా టి నాణ్యతా ప్రామాణాలను బట్టి ఒక్కో ధర ఉంది.

**విత్తనాల ధరలు ఎక్కువే..**

బహిరంగ మార్కెట్‌లో విత్తనాల ధరలు అధికంగానే ఉన్నాయి. ఒక కిలో కంది విత్తనాల బస్తా రూ.250 ఉంది. జొన్నలు 3 కిలోల బస్తా రూ.550, వరి బస్తా రూ.950, పెసర విత్తనాల బస్తా రూ.720, పత్తి విత్తనాలు 450 గ్రాములకు రూ.850 చొప్పున విక్రయిస్తున్నారు.

## క్లుప్తంగా

### ఆర్టీఏ కార్యాలయంలో ట్రైయినీ కలెక్టర్



ఆర్‌టీఏ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

అనంతగిరి: శిక్షణలో భాగంగా వికారాబాద్‌కు వచ్చిన ట్రెయినీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం వికారాబాద్‌లోని ఆర్‌టీఏ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

### శంకర్‌పల్లిలో ఆత్మహత్య.. జహీరాబాద్‌లో విషాదం

జహీరాబాద్: బీఆర్‌ఎస్ సీనియర్ నేత డి.లక్ష్మారెడ్డి శంకర్‌పల్లిలో రైలు పట్టాలపైపడి ఆత్మహత్య చేసుకోగా, శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన అల్లీపూర్‌లో అంత్యక్రియలు జరిగాయి. టీడీపీ, బీఆర్‌ఎస్‌లో సీనియర్ నేతగా పనిచేసిన లక్ష్మారెడ్డి మరణంతో ఒక్కసారిగా జహీరాబాద్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మారెడ్డి రెండేళ్లుగా పార్టీ క్రియాశీలక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ నగరంలోని నిజాంపేటకు మకాం మార్చారు. అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు.

**ఎంపీపీగా రాజకీయ ప్రస్థానం మొదలై...**

లక్ష్మారెడ్డి టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి అంచలంచెలుగా ఎదిగారు. 1995లో టీడీపీ తరఫున జహీరాబాద్ ఎంపీపీగా పనిచేశారు. ఆ సమయంలో కేసీఆర్ జిల్లా మంత్రిగా ఉన్నారు. ఇద్దరి మధ్య సత్సంబంధాలుండేవి. టీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత లక్ష్మారెడ్డి కేసీఆర్‌ను జహీరాబాద్‌కు పిలిపించుకొని ఆయన సమక్షంలోనే పార్టీలో చేరారు. 2017లో జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగారు. అనంతరం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. లక్ష్మారెడ్డి తల్లి ఈశ్వరమ్మ కూడా ఒక పర్యాయం అల్లీపూర్ సర్పంచ్‌గా పనిచేశారు.

**ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడి..**

1999 అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ కోసం లక్ష్మారెడ్డి ప్రయత్నించారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న బాగన్నపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయనకు సమాంతరంగా రాజకీయాలు నెరిపారు. దీంతో బాగన్న, లక్ష్మారెడ్డిని కాదని గుండప్పకు టీడీపీ టికెట్ కేటాయించారు. రాష్ట్రంలో మారిన రాజకీయాల నేపథ్యంలో టీడీపీకి రాజీనామా చేసి అప్పట్లో మంత్రిగా ఉన్న జె.గీతారెడ్డి సమక్షంలో 2004 తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో ఇమడలేక 2016లో టీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం లక్ష్మారెడ్డి డీసీఎంఎస్ డైరెక్టర్‌గా ఉన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పదవిని ఆశించినా కలిసి రాలేదు.

**స్వగ్రామంలో అంత్యక్రియలు**

లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి స్వగ్రామం అల్లీపూర్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు.

### 12న తెలంగాణ రన్

చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న చేవెళ్లలో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నామని ఆర్డీఓ వేణుమాదవ్‌రావు అన్నారు. చేవెళ్ల శుక్రవారం డివిజన్‌లోని నాలుగు మండలాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి పోలీసుశాఖ నుంచి పూర్తి మద్దతు ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. 12న ఉదయం 7గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి పోలీస్‌స్టేషన్ వరకు పరుగు పందెం ఉంటుందని తెలిపారు. ఈ రన్‌లో ఆసక్తి గల వారంతా పాల్గొనవచ్చని చెప్పారు. వయస్సుతో సబంధం లేదని అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నాలని కోరారు.



# తెల్లబంగారం వైపే రైతన్న చూపు

**సాగుకు సన్నద్ధం**

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో బిజీ



ఎన్కేపల్లిలో ట్రాక్టరుతో సాళ్లు..

మోమిన్‌పేట: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు తెల్ల బంగారం సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి సాగు చేస్తే నష్టాలు తక్కువగా వస్తాయన్న ఉద్దేశంతో పత్తి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మొక్కజొన్న సాగు చేస్తే విత్తనం విత్తినది మొదలు మార్కెటుకు తరలించే వరకు అడవి పందుల నుంచి నిరంతరం కాపాలా కాయాల్సి ఉంటుందని చెబుతున్నారు. పత్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం పొడుగు పింజ రకం పత్తి క్వింటాలుకు రూ.7,020లుగా నిర్ణయించడంతో భరోసాతో సాగు చేస్తున్నారు. వారం రోజుల్లో రుతు పవనాలు రానున్నాయని వాతావరణ శాఖ తెలపడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం, విత్తుకొనేందుకు సాళ్లు తయారు చేసుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. అక్కడక్కడా అకాల వర్షాలు కురుస్తుండటంతో కొన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలను విత్తుకొంటున్నారు. గత సంవత్సరం బహిరంగ మార్కెటులో క్వింటాలుకు రూ.7,500ల నుంచి రూ.9,600 వరకు ధర పలికింది. ఈసారి రూ.8వేలకు తక్కువ కాకుండా అమ్ముడు పోతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మండలంలో 26,700 ఎకరాలలో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నారు. అందులో తెల్లబంగారం 20వేల ఎకరాల మేర సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది 19,158 ఎకరాలలో పత్తిని సాగు చేశారు. మొక్కజొన్న కేవలం 1100 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు పేర్కొంటున్నారు. పెసలు, మినుములు, సోయాబీన్ తదితర పంటలు రెండంకెల ఎకరాలకు దాటడం లేదు. కందుల సాగును పెంచాలని అధికారులు భావిస్తున్నా మొక్కజొన్న, పెసలు, మినుములు, సోయాబీన్‌ల సాగు తగ్గడంతో కందుల సాగు విస్తీర్ణం పెరగకపోవచ్చని రైతులు అంటున్నారు. అతివృష్టి ఏర్పడితే కందులు ఆశించిన స్థాయిలో దిగుబడులు రావంటున్నారు. వానాకాలం సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి జయశంకర్ తెలిపారు.

**వర్షాలు కురిసిన తర్వాతే..**



వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాతే విత్తనాలను విత్తుకోవాలి. అకాల వర్షాలకు అదను కాకపోతే విత్తుకోవద్దు. జూలై మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకొనేందుకు సమయం ఉంది. రైతులు అప్పుడే తొందర పడవద్దు. ఎరువులు, విత్తనాలు లైసెన్సు ఉన్న డీలరు వద్దే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకొవడం మర్చిపోవద్దు. దుక్కులు తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలి.

– జయశంకర్, వ్యవసాయాధికారి, మోమిన్‌పేట

### అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం ఖాంజాపూర్ గేట్ సమీపంలోని రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో గణితం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం బోధించుటకు అధ్యాపకులు అవసరమన్నారు. అలాగే పాఠశాలలో బోధించుటకు తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లం, గణితం, జీవ శాస్త్రం, సాంఘికశాస్త్రం బోధించుటకు ఉపాధ్యాయులు కావాలన్నారు. అర్హత ఉన్న వారు ఈనెలాఖరు లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులు వివరాలివ్వాలి

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాలని టీపీఓ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఓటీపీ కోసం లబ్ధిదారులవి కాకుండా వారి ఫోన్ నంబర్లను ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు లబ్ధిదారుల వివరాలతో పాటు, ప్లాటుకు సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు చేరవేద్దామనుకుంటే ఫోన్ నంబర్లు సక్రమంగా లేవన్నారు. లబ్ధిదారులు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అధికారులకు వివరాలు ఇవ్వాలన్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

కుల్కచర్ల: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసిన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాంపూర్ గ్రామపంచాయతీ గండిచెరువు ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. డ్రైవర్ గోపాల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## విత్తనాల కృత్రిమ కొరత.. వ్యాపారుల మాయాజాలం

ధారూరు: పత్తి విత్తనాల కోసం ఫెర్టిలైజర్ దుకాణాలకు వెళ్లే రైతులకు మొండి చెయ్యి ఎదురవుతున్నది. నాణ్యమైన విత్తనాలు కావాలని అడిగితే ఇంకా సరఫరా కాలేదని, వస్తే కబురు చేస్తాం అంటూ వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సదానంద్, తులసీ, నవనీత్, రాశి తదితర నాణ్యమైన విత్తనాలను అడిగితే స్థానిక డీలర్ల వద్ద లేవనే సమాధానం వస్తున్నది. కావాలనే విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. అందులో భాగంగానే స్టాక్ లేదని చెబుతూ వెయ్యి ప్యాకెట్ల విత్తనాలు అడిగితే వంద ఇస్తూ మమ అనిపిస్తున్నారని అంటున్నారు. ముందుగా కొనుగోలు చేయకపోతే దొరకవేమోనన్న ఆందోళనతో పత్తి విత్తనాల కోసం క్యూ కడుతున్నారు. స్థానిక డీలర్ల వద్ద లేవని తెలుసుకుంటున్న రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుగోలుకు చేస్తున్నారు. రూ. వెయ్యి ధర ఉన్న నాణ్యమైన పత్తి విత్తన ప్యాకెట్‌కు రూ. 2 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడంలేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు నకిలీ విత్తనాల బెడద తొలగడంలేదని అంటున్నారు. నకిలీ విత్తనాలు అరికట్టాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**కొనడానికి వెళ్తే లేవంటున్నారు**



నాణ్యమైన పత్తి విత్తనాల కోసం ఫెర్టిలైజర్ దుకాణాలకు వెళ్తే స్టాక్ రాలేదని చెబుతున్నారు. అయితే బ్లాక్‌లో ఎక్కువ ధరకు దొరుకుతున్నాయి. రూ.853 ధర ఉన్న పత్తి ప్యాకెట్‌ను బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతిగారి మల్లేశం, రైతు, ధారూరు

## వీబీఓ వ్యవస్థతో ఆర్టీసీ ప్రగతి బాట



నూతనంగా నియామకమైన వీబీఓలతో తాండూరు డీఎస్పీ, ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎం

**తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్**

తాండూరు టౌన్ : విలేజ్ బస్ ఆఫీసర్ (వీబీఓ) వ్యవస్థతో ఆర్టీసీ ప్రగతి బాట పట్టనుందని డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం తాండూరు ఆర్టీసీ బస్ డిపోలో నూతనంగా నియామకమైన వీబీఓ వ్యవస్థను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీధర్, డిపో మేనేజర్ సమతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో వీబీఓ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుందని అన్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏ, పోలీసు శాఖలో వీపీఓ వ్యవస్థ ఉన్నట్లుగానే ఆర్టీసీలో సైతం వీబీఓ వ్యవస్థను అమల్లోకి తేవడం సత్ఫలితాలనిస్తుందన్నారు. అనంతరం రీజినల్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో, వారి భాగస్వామ్యంతోనే ఏ సంస్థ అయినా ఉత్తమ ఫలితాలను సాధిస్తుందన్నారు. ఆర్టీసీ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వీబీఓ వ్యవస్థ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. డిపో మేనేజర్ సమత మాట్లాడుతూ తాండూరు డిపో పరిధిలోని 98 గ్రామాలకు గాను 25 మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించామన్నారు. వీరు ఒకటి నుంచి ఐదు గ్రామాల్లో సేవలందిస్తారన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసుల పనితీరు, రాయితీలు, సంస్థ అభివృద్ధిపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకుని సంస్థకు చేరవేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ నందాలాల్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఆర్టీసీని ఆదరించండి**

అనంతగిరి: ఆర్టీసీని ఆదరించాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర కోరారు. వికారాబాద్ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమంలోనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి ప్రతిఒక్కరూ చేయూతనివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం సరిరాం, డీఎం భిక్షినాయక్, ఏఎంఎఫ్ ధనుంజయ, జీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కళ్లెదుటే కుమారుడు మృతి

- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం
- మరో కుమారుడికి తీవ్ర గాయాలు
- తల్లడిల్లిన దంపతులు



బాలుడి మృతదేహం వద్ద తండ్రి రోదన

కొడంగల్ రూరల్ : ఏడేళ్ల బాలుడు కళ్లెదుటే మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లారు. బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో బాలుడు మృతిచెందగా మరో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని చిట్లపల్లి శివారులో శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మప్ప బైక్‌పై భార్య అనిత, కుమారులు అఖిల్(7), గోపి, కూతురు లక్ష్మితో కలిసి కోస్గి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చిట్లపల్లి శివారులో వెనక నుంచి ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో బాలుడు అఖిల్(7) తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గోపి కాలుకు తీవ్ర గాయాలు కావడంతో తాండూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అఖిల్ తండ్రి లక్ష్మప్ప ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు.

### నేడు కలెక్టరేట్‌లో సుపరిపాలన దినోత్సవం

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెకెరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు సుపరిపాలన దినోత్సవం, ఆదివారం సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు వారి శాఖల్లో ప్రజలకు అందుతున్న సేవలను వివరించాలన్నారు. 11న సాహిత్య దినత్సోవం లో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించాలని, ఉత్తమ కవితలను ముద్రించాలని సూచించారు.

### కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని కుల వృత్తుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం చేసే ఆర్థిక చేయూతను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, నాయకులు యుగంధర్, రాంచందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### ‘శ్రమించే వారికి పదవులు ఖాయం’

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల క్యాంపు కార్యాలయంలో మండలంలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన జీ కాంతిరెడ్డిని బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ.. పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు లభిస్తాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులను వసతి గృహంలో చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వార్డెన్ తుల్జారాంగౌడ్

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుకునేలా చూడాలని సిరిపురం ఎస్సీ వసతి గృహం వార్డెన్ తుల్జారాంగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పిల్లిగుండ్ల, గుండ్లమర్పల్లి, నర్సాపూర్, పంచలింగాల గ్రామాలలో వసతి గృహాల్లో విద్యార్థులను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతులు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు.

## చెరువులో గల్లంతైన వ్యక్తి శవం లభ్యం



ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: చెరువులో గల్లంతైన శేఖర్‌రెడ్డి శవం గురువారం రాత్రి లభ్యమైందని ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. మండల పరిధిలోని దేవరంపల్లికి చెందిన పి.శేఖర్‌రెడ్డి(35) రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పాల్గొన్నారు. చెరువులో ఈత కొడుతు కొంత దూరం వెళ్లాక నీటిలో మునిగిపోయాడు. గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి శవం లభ్యమైంది. మృతుని తల్లి పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

**శేఖర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం**

శేఖర్‌రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. శుక్రవారం ఉదయం మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

## దాతల స్థలంలో పండ్ల మొక్కలు పెంచుతాం

**యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఈఓ గీత**




దేవాలయానికి భూ దానం చేసిన దాతలను సన్మానించి ప్రసాదం అందజేస్తున్న గీత

మొయినాబాద్ రూరల్: కనకమామిడిలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి యాదగిరిగుట్ట దేవాలయ స్థలంలో పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణ అధికారి గీత, సహాయ కార్య నిర్వాహణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి సమీపంలో గల ఒక ఎకరం, నదీంనగర్ రెవెన్యూలోని ఒక 1.27 ఎకరాల భూమి పట్టాదారులు గతంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం దాతలు ఇచ్చిన భూమిని సందర్శించారు. స్థానిక సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, మండల తహసీల్దార్ అశోక్‌కుమార్‌లతో కలిసి ఈ స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం భూ దాతలను దేవాలయ కార్యనిర్వాహకులు సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో స్థలానికి ప్రహరీ (ప్రీకాస్ట్) ఏర్పాటు చేసి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పండ్ల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షాపురం వెంకట్ రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నరేందర్, కోట్ల బల్వంత్ రెడ్డి, అంతిరెడ్డిగారి మోహన్‌రెడ్డి, షాపురం నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి గారి శ్రీనివాస్‌రెడ్డి, జియన్నగారి ఈశ్వర్‌రెడ్డి, పట్లోళ్ల విఠల్‌రెడ్డి, పంచలింగాల సుదర్శన్‌రెడ్డి, గాజుల రాఘవేందర్, సి.హెచ్.వెంకటేశ్, గ్రామ పెద్దలు, దేవస్థాన ఇంజనీర్ మైపాల్‌రెడ్డి, దేవస్థాన సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వికలాంగుల బంధు ప్రకటించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్



కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఇబ్రహీంపట్నం రూరల్: వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ విచ్చేసి మాట్లాడారు. వికలాంగులకు ప్రభుత్వం రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. దళితబంధు మాదిరిగా వికలాంగుల బంధు ప్రకటించాలని కోరారు. ప్రతి జిల్లాలో వికలాంగుల మహిళా వసతి గృహాలు ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల భవనాలు నిర్మాణం చేయాలని కోరారు .వికలాంగుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. వికలాంగులకు పూర్తి స్థాయి పెన్షన్ ఇవ్వాలని, కోరిన చోటుకు ఉద్యోగుల బదిలీ చేయాలని కోరారు. వికలాంగుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం ఇచ్చిన జీవో 34ను తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు గోపాల్‌రావు, మాజీ జాతీయ అధ్యక్షుడు అందె రాంబాబు, సుజాత సూర్యవంశి తదితరులు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి పడి చిన్నారి మృతి



రిషిక

శంకర్‌పల్లి: భవనంపై నుంచి పడి ఓ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేష్మికుమారి, రుదగిరి సింగ్ దంపతులు ఎనిమిది నెలలుగా మండలంలోని దొంతాన్‌పల్లిలో అద్దెకు ఉంటున్నారు. గురువారం సాయంత్రం రేష్మి కుమారుడికి పాలు పడుతుండగా ఇద్దరు కూతుళ్ల మేడపైకి వెళ్లారు. ప్రమాద వశాత్తు రిషిక(3) భవనంపై నుంచి కింద పడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం శంకర్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ నరేష్ తెలిపారు.